సాక్షి
ఆదిలాబాద్

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



అన్యాయానికి గురవుతున్న ఆదివాసీలు 6లో▸

ఆదివాసీలు చారిత్రక అన్యాయానికి గురవుతున్నారని మానవ హక్కుల వేదిక ఉమ్మడి రాష్ట్ర సమన్వయకర్త వీఎస్ కృష్ణ అన్నారు.

'సూపర్' సంస్కృతి



జిల్లా కేంద్రంలో కార్పొరేట్‌కు చెందిన సూపర్ మార్కెట్లు అందుబాటులోకి వచ్చేశాయి. అన్నిరకాల వస్తువులు అందుబాటులో ఉండడంతో షాపింగ్ చేసేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. 7లో▸

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మెడికోలకు అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందజేస్తున్న బీఎస్ రావు

ఆదిలాబాద్‌టౌన్: వైద్య విద్యార్థులకు అండగా ఉంటామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ రావ్ అన్నారు. రిమ్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 25 మంది మెడికోలకు అసోసియేషన్ తరపున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్థిక పరిస్థితులు సహకరించక అనేక మంది మెడికోలు చదువు మధ్యలోనే ఆపేస్తున్నారన్నారు. విషయం తమ దృష్టికి రావడంతో వారిని ఆదుకోవడానికి ముందుకు వచ్చామన్నారు. మంచి వైద్యులుగా ఎదిగి సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి విజయ్ రావు, కోశాధికారి రాజేందర్ కుమార్, సంయుక్త కార్యదర్శి ఆలీం, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, శ్యాం, డాక్టర్ సుమలత, ఇద్రిస్ అక్బానీ తదితరులున్నారు.

1 నుంచి 3 వరకు వైద్యశిబిరం

ఆదిలాబాద్‌రూరల్: మే డే సందర్భంగా ఈ నెల 1 నుంచి 3 వరకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రావణి ప్రకటనలో తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ), హెల్త్‌కేర్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరాన్ని కార్మిక శాఖ గుర్తింపుకార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో బీపీ, షుగర్, కంటి, రక్త, మూత్ర, ఈసీజీ తదితర 50కి పైగా ఆరోగ్య పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక టీఎన్‌జీవో గార్డెన్ పక్కన గల భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో ఉదయం 10 గంటల నుంచి శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చే కార్మికులు తమ వెంట లేబర్‌కార్డ్, ఆధార్ కార్డు తెచ్చుకోవాలని సూచించారు.

జేఈఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



వి.నిఖిత



రాథోడ్ జాహ్నవి



సాయి కిరణ్

ఆదిలాబాద్‌టౌన్: జేఈఈ మెయిన్స్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఇందులో ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వి. నిఖితకు 4416వ ర్యాంకు, రాథోడ్ జాహ్నవికి 4970వ ర్యాంకు, పవార్ సాయి కిరణ్‌కు 5691వ ర్యాంక్, జి.లింగరాజుకు 8113వ ర్యాంకు, జే.శ్రావణ్‌కు 9283వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం వారిని అభినందించారు. తమ పిల్లలు మెరుగైన ర్యాంకులు సాధించడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా జైలును సందర్శించిన హైకోర్టు జడ్జి



అధికారులతో హైకోర్టు జడ్జి సుధీర్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా జైలును హైకోర్టు న్యాయమూర్తి సుధీర్ కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో సమావేశమయ్యారు. ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సరీలు, స్టీల్ ఫ్యాక్టరీ, ఫిమేల్ ఎన్‌క్లోజర్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వీరి వెంట జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి శివరామ్ ప్రసాద్, జైలు సూపరింటెండెంట్ అశోక్, జైలర్ ప్రకాశ్ రెడ్డి, డిప్యూటీ జైలర్ కృష్ణ, తదితరులున్నారు.

వావ్.. అనిపించేలా!



ఇది భీంపూర్ మండలం ధనోరా గ్రామానికి చెందిన ఆదర్శ రైతు గోవర్ధన్ యాదవ్ బెల్సారిరాంపూర్‌లోని తన పంట చేనులో నిర్మించుకున్న ఫాంహౌస్. సంప్రదాయానికి భిన్నంగా పసుపు, అల్లం వంటి పంటలు పండిస్తున్న ఈ రైతు ఇంటికి ఏమాత్రం తీసిపోని విధంగా సకల హంగులతో దీనిని నిర్మించుకున్నాడు. వివిధ రకాల పూలమొక్కలు, పచ్చదనంతో కనువిందు చేసే లాన్‌తో సుందరంగా తీర్చిదిద్దాడు. ఈ మార్గంలో వెళ్లే ప్రతి ఒక్కరిని ఈ నిర్మాణం ఇట్టే ఆకర్షిస్తోంది.



భీంపూర్ మండలం నిపాని గ్రామానికి చెందిన రాజేశ్వర్ అనే ఈ రైతు తనకున్న పది ఎకరాల చేనులో నిర్మించుకున్న ఫాంహౌస్ ఇది. పత్తి, సోయా, మిర్చి వంటి వాణిజ్య పంటలతో పాటు కూరగాయలు సాగు చేస్తున్నాడు ఈయన. పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు ఇబ్బంది కలుగకుండా ఉండేలా చేనులోనే ఇలా నిర్మించుకున్నాడు. ఇందులో రకరకాల పూల మొక్కలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఆకట్టుకుంటుంది.



రాజ భవంతిని తలపించేలా కనిపిస్తున్న ఈ నిర్మాణం తలమడుగు మండలం కజ్జర్ల గ్రామంలోని ఓ ఫాంహౌస్. తాంసి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యుడు రవి కిరణ్‌యాదవ్ సకల హంగులతో నిర్మించుకున్నారు ఇలా. వృత్తిపరంగా బీజీగా గడిపే ఈయన జిల్లాకు వస్తే కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడ ప్రకృతి ఒడిలో ఆహ్లాదంగా గడిపేందుకు ఇష్టపడుతారు. చుట్టు పక్కల గ్రామస్తులు చిన్నపాటి వేడుకలను సైతం ఇక్కడే నిర్వహించుకుంటున్నారు.

- చేలల్లోనే భవనాలు
- సకల హంగులతో నిర్మాణాలు
- సరదాగా.. వీకెండ్ వేదికగా
- జిల్లాలో పెరుగుతున్న ఫాంహౌస్ కల్చర్

కైలాస్‌నగర్: జిల్లాలో ఫాంహౌస్ కల్చర్ క్రమంగా పెరుగుతోంది. అన్నదాతలు మారుతున్న కాలానికనుగుణంగా అడుగులు వేస్తున్నారు. సాగు మెలకువలు అందిపుచ్చుకుని వైవిధ్యమైన పంటల సాగుతో పాటు సౌకర్యవంతంగా ఉండేందు కోసం ఫాంహౌస్ నిర్మాణాలపై ఆసక్తి చూపుతున్నారు. సాగుకు అవసరమైన పనిముట్లు, ఎరువులు, విత్తనాలను భద్రపర్చడంతో పాటు పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు వీలుగా నిర్మించుకుంటున్నారు. కొంతమంది రెండు, మూడు గదులతో కూడిన నిర్మాణాలు చేపడుతుండగా.. మరికొంతమంది సకల హంగులతో కూడిన భవంతులు నిర్మించుకుంటున్నారు. సెలవు రోజుల్లో సరదాగా కుటుంబ సమేతంగా గడిపేందుకు వీలుగావసతులు సమకూర్చుకుంటున్నారు. బర్త్‌డేలు, పెళ్లిరోజు వంటి వాటితో పాటు విందు, వినోదాలకు సైతం ఇవి వేదికలుగా మారుతున్నాయి. గతంలో జిల్లాలో ఎక్కడోచోట కన్పించే ఇవి ప్రస్తుతం చిన్నపాటి గ్రామాలకు సైతం విస్తరిస్తున్నాయి.



తలమడుగు మండలం దేవాపూర్ సమీపంలోని ఫాంహౌస్

సిటీకల్చర్‌కు అలవాటు పడిన వారంతా మళ్లీ పచ్చదనం మధ్యసేద తీరాలని భావిస్తున్నారు. వీకెండ్‌తో పాటు బర్త్‌డే, ఇతర ప్రత్యేక రోజుల్లో పంట క్షేత్రాల్లో సరదాగా గడిపేందుకు ఇష్టపడుతున్నారు. ఇందులో భాగంగా రైతులతో పాటు కొందరు ఫాంహౌస్‌ల నిర్మాణంపై ఆసక్తి చూపుతున్నారు. ఆహ్లాదపరిచే వాతావరణాన్ని ప్రత్యేకంగా సృష్టించుకుంటున్నారు. కనువిందు చేసే పూలు, విభిన్న పండ్ల మొక్కలతో పాటు చిన్నారులు సరదాగా గడిపేలా ఆటవస్తువులను ఇందులో పొందుపరుస్తున్నారు. సాగు సామగ్రితో పాటు పంట ఉత్పత్తులను నిల్వచేసుకునేలా కొందరు నిర్మించుకుంటుండగా.. ఆర్థికంగా ఉన్న వారు తమ స్టేటస్‌కు తగ్గట్లు సకల హంగులతో వావ్ అనేలా వీటిని తీర్చిదిద్దుతున్నారు.

ఎంతో ఉపయోగకరం



మా చేనులో పసుపు, మిర్చి, అల్లం, పుచ్చకాయ వంటి పంటలతో పాటు కూరగాయలు వంటివి పండిస్తున్నా. పంట ఉత్పత్తులను ఇంటికి తీసుకెళ్లి భద్రపర్చడం సమస్యగా ఉండేది. ఫాంహౌస్ నిర్మించుకున్నాక సామగ్రితో పాటు పంట ఉత్పత్తులను కూడా ఇక్కడే భద్రపరుస్తున్నా. చుట్టూ రకరకాల పూలు, పండ్ల మొక్కలను పెంచుతున్నా. పిల్లలు సరదాగా గడిపేలా ల్యాన్ ఏర్పాటు చేసిన. చేనుకు వెళ్లినా ఇంట్లోనే ఉన్నట్లుగానే అన్పిస్తోంది.

– గోవర్ధన్ యాదవ్, రైతు ధనోరా

ప్రకృతికి దగ్గరుండాలనే

ప్రకృతికి దగ్గరగా ఉండాలనే ఉద్దేశంతోనే ఫాంహౌస్ నిర్మించాను. విధి నిర్వహణలో భాగంగా సూర్యాస్తమయం, సూర్యోదయం చూసిన సందర్భాలు అరుదుగా మారాయి. ప్రకృతి నడుమ జీవిస్తే మనసు ప్రశాంతంగా ఉంటుంది. అభివృద్ధి పరంగా ఆదిలాబాద్ జిల్లా ఏమాత్రం తక్కువ కాదని ఉద్దేశంతోనే ఖర్చుకు వినపడకుండా ఈ భవంతిని నిర్మించాను.

– రవికిరణ్ యాదవ్, ప్రముఖ వైద్య నిపుణులు

పింఛన్‌తో మరుగుదొడ్డి నిర్మాణం

- ఆదర్శం.. ఈ గిరిజన వృద్ధురాలు



మరుగుదొడ్డిని చూపుతున్న బుద్దుబాయి

తాంసి: గ్రామాల పరిశుభ్రత, స్వచ్ఛత కోసం అధికారులు ఎంత అవగాహన కల్పిస్తున్నా ఫలితం అంతగా కనిపించడం లేదు. కానీ ఈ ఓ ఒంటరి గిరిజన వృద్ధురాలు చదువు రాకున్నా.. పేదరికంలో ఉండి కూడా నెలనెలా వచ్చే పింఛన్‌తో మరుగుదొడ్డి నిర్మించుకొని పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం మార్కగూడ గ్రామానికి చెందిన ఉయిక బుద్దుబాయి తన ఒక్కగానొక్క కూతురు వివాహం చేసి గ్రామంలోనే పెంకుటింట్లో ఒంటరిగా జీవిస్తోంది. అయితే మరుగుదొడ్డిపై అధికారులు అవగాహన కల్పించడంతో తనకు ప్రతి నెలా వచ్చే పింఛన్ డబ్బులు పోగుచేసి ఇంటి ఆవరణలో నిర్మించుకుంది. ఇటీవల స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ జావిద్ పరిశీలించి సర్పంచ్ సునీత, బుద్దుబాయితో కలిసి మరుగుదొడ్డి వీడియోను స్వచ్ఛభారత్.. స్వచ్ఛ ఆదిలాబాద్ వేదికగా ట్విట్టర్‌లో పోస్టు చేశారు. వృద్ధురాలికి మరుగుదొడ్డి నిర్మాణ నిధుల కింద రూ.12వేల చెక్కు అందజేశారు. ప్రతీ ఒక్కరూ ఇలా మరుగుదొడ్డి ఆవశ్యకత గుర్తించినట్లయితే స్వచ్ఛ భారత్ లక్ష్యం నెరవేరినట్లే.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్: నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉట్నూర్, బోథ్, ఆదిలాబాద్ పట్టణంలోని రెండు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 1,378 మంది విద్యార్థులకు గాను 1,232 మంది హాజరయ్యారు. 146 మంది గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

చట్టాలు ఆచరణకు నోచుకోవాలి



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి సుధీర్‌కుమార్

- హక్కులు, బాధ్యతలు తెలిసినప్పుడే సామాజిక న్యాయం
- హైకోర్టు జడ్జి సుధీర్‌కుమార్

ఆదిలాబాద్: ప్రభుత్వాలు చట్టాలు చేయడమే కాకుండా వాటి ఆచరణలో చిత్తశుద్ధిగా వ్యవహరించినప్పుడే సమానత్వంతో కూడిన సమాజం సాధ్యమవుతుందని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి సుధీర్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ న్యాయవాది పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమరసతా దివస్ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శినితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం భరతమాత, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సుధీర్ కుమార్ మాట్లాడారు. పౌరులు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకున్నప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. అట్టడుగు వర్గాల వారికి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. న్యాయ సాయం అందించడంలో న్యాయవాదులు ముందుండాలని సూచించారు. న్యాయ సేవ ప్రాధికార సంస్థ చురుకుగా పనిచేస్తూ న్యాయ సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ముందుకు రావాలని సూచించారు. న్యాయమూర్తి ప్రియదర్శిని మాట్లాడుతూ భారత రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలన్నారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, ప్రమీలా జైన్, మంజుల, యశ్వంత్ సింగ్ చౌహాన్, ఆదివాసీ హక్కుల పరిరక్షణ ఇన్‌చార్జి వనవాసి కల్యాణ పరిషత్ గిరీష్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రమోహన్, చంద్రకాంత్ చౌదరి తదితరులు ఉన్నారు.

రైల్వేస్టేషన్ ఆధునికీకరణ

- 'అమృత్ భారత్' స్కీంలో ఎంపిక
- నిరంతర ప్రాతిపాదికన దశల వారీగా అభివృద్ధి
- మాస్టర్ ప్లాన్ రూపకల్పన
- సెకండ్ ఎంట్రీ కోసం ప్రణాళిక



ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో ట్రాక్, పిట్‌లైన్‌ను శుక్రవారం పరిశీలిస్తున్న దక్షిణమధ్య రైల్వే జీఎం



ఆదిలాబాద్ రైల్వే స్టేషన్

సాక్షి,ఆదిలాబాద్: ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరించే దిశగా అడుగులు పడుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ స్టేషన్ అవసరాలు దృష్టిలో పెట్టుకుని తదనుగుణంగా ముందుకు కదులుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమృత్ భారత్ స్కీంను రూపొందించింది. ఇందులో భాగంగా దేశంలోని 1275 స్టేషన్లను ఆధునికీకరించాలని నిర్ణయం తీసుకుంది. అందులో దక్షిణ మధ్య రైల్వే నాందేడ్ డివిజన్ పరిధిలోని ఆదిలాబాద్ స్టేషన్ కూడా ఉంది. తద్వారా నిరంతర ప్రతిపాదికన దశల వారీగా ఈ స్టేషన్ అభివృద్ధి కోసం చర్యలు తీసుకోనున్నారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్ ప్రధాన కార్యాలయంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ శుక్రవారం ఆదిలాబాద్ స్టేషన్‌ను పరిశీలించారు.

మాస్టర్‌ప్లాన్ రూపకల్పన..

ఈ స్కీమ్‌లో భాగంగా చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించి ఆర్కిటెక్చర్ల సాయం తీసుకోనున్నారు. మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నారు. ఈ పథకం దీర్ఘకాలిక దృష్టితో స్టేషన్ అభివృద్ధిని నిరంతరంగా అంచనా వేస్తూ పనులు చేపట్టనున్నారు. ఈమేరకు ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. సౌకర్యాలను మెరుగుపర్చడమే ప్రధాన లక్ష్యం.

ప్రణాళికలో విస్తృత లక్ష్యాలు..

ఈ ప్రణాళికలో విస్తృత లక్ష్యాలను నిర్దేశించారు. ఓ వైపు మాస్టర్ ప్లాన్ రూపొందించడం ద్వారా స్టేషన్ స్థలం ఎంత అన్నది కూడా స్పష్టం అవుతుంది. మరో వైపు సెకండ్ ఎంట్రీ ఎటు వైపు నుంచి అభివృద్ధి చేస్తారనేది కూడా ఆసక్తికరమే. స్టేషన్‌కు సంబంధించిన భూములు పరాదీనమయ్యాయని విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే మాస్టర్ ప్లాన్, అదే విధంగా సెకండ్ ఎంట్రీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మారుతున్న రూపురేఖలు..

ఆదిలాబాద్ ప్రజలకు రైల్వే సౌకర్యాల పరంగా ముమ్ముందు మంచి రోజులు రానున్నాయన్న అభిప్రాయం ఇటు అధికార వర్గాల నుంచి అటు ప్రజాప్రతినిధుల, ప్రజల నుంచి కూడా వ్యక్తం అవుతోంది. ఇప్పటికే ఎలక్ట్రిఫికేషన్ పనులు పూర్తయ్యాయి. ముంత్రి నుంచి ఆదిలాబాద్‌కు రైల్వే ట్రాక్ రిపేరింగ్ పనులు, అలాగే రైల్వేట్రాక్ ఉన్నతీకరణ పనులు పూర్తయ్యాయి. పిట్‌లైన్ పనులు పురోగతిలో ఉన్నాయి. మరో ఎనిమిది నెలల్లో దీని పూర్తి చేస్తామని అధికారులు చెప్తున్నారు. నాందేడ్ స్టేషన్‌కు వచ్చే రైళ్ల రద్దీతో ఆ రైళ్లను ఇతర స్టేషన్ల వరకు పొడిగించాలనే ఆలోచనలో రైల్వేశాఖ ఉంది. పిట్‌లైన్ పూర్తయిన పక్షంలో అనేక రైళ్లు ఆదిలాబాద్ స్టేషన్‌కు పొడిగించే అవకాశం ఉంటుంది. మరో పక్క ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించి సర్వే పూర్తయినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలుపుతున్నారు. ఇలా రానున్న రోజుల్లో రైల్వే మార్గాల పరంగా ఆదిలాబాద్ కీలకమయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆధునికీకరిస్తాం..

అమృత్ భారత్ స్కీమ్‌లో భాగంగా ఆదిలాబాద్ స్టేషన్ ఎంపికైంది. ఆధునికీకరణ పనులు దశల వారీగా చేపడతాం. స్టేషన్‌లో ప్రయాణికుల అవసరాలకు తగ్గట్లు సదుపాయాలను అభివృద్ధి చేయడం జరుగుతుంది.

– అరుణ్‌కుమార్ జైన్, జీఎం, దక్షిణమధ్య రైల్వే

ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలి

రైల్వేస్టేషన్ వెనకాల ఉన్న 12 కాలనీల ప్రజలు పట్టణంలోకి వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్టేషన్ వెనుక ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి. అమృత్ భారత్ స్కీమ్‌లో ఇలాంటి పనులు తీసుకోవాలని శుక్రవారం స్టేషన్ పరిశీలించిన దక్షిణమధ్య రైల్వే జీఎంకు వివరించాం.

– సుహాసినిరెడ్డి, బీజేపీనేత, ఆదిలాబాద్

వైద్యం వికటించి బాలింత మృతి

- ఆసుపత్రి ఎదుట కుటుంబీకుల ఆందోళన
- ప్రసవం కోసం వెళ్తే గర్భసంచినే తొలగించారు
- రక్తస్రావంతో విషమించిన పరిస్థితి
- వైద్యుల హామీతో సద్దుమణిగిన వివాదం

ఆదిలాబాద్‌టౌన్: నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చిన ఓ బాలింత పుట్టిన పాపను చూడకుండానే ప్రాణలొదిలిన విషాదకర ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. జైనథ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన గర్భిణి ప్రసవం కోసం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ సమీపంలో గల ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శుక్రవారం చేరింది. ఆమెకు ఇదివరకే కుమారుడు, కూతురు ఉన్నారు. మూడో సంతానం కోసం కుటుంబీకులు ఆసుపత్రిలో చేర్పించగా, మధ్యాహ్నం 3గంటల సమయంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు ఇదివరకు రెండు సార్లు సిజేరియన్ కాగా, మూడోసారి వైద్యురాలు సిజేరియన్ చేసి కాన్పు చేశారు. డాక్టర్ నిర్లక్ష్యమో ఏమో గానీ వైద్యం వికటించింది. ఆమెకు తీవ్ర రక్తస్రవం అయ్యింది. ఏకంగా గర్భసంచినే తొలగించారు. దీంతో తీవ్ర ఒత్తిడికి గురైన బాలింతకు రక్త ప్రసరణ తగ్గింది. రాత్రి వరకు అదే ఆసుపత్రిలో వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో పక్కనే ఉన్న మరో ప్రైవేట్ ఆసుపత్రిలో రాత్రి 11గంటల సమయంలో చేర్పించారు. వెంటిలేటర్లు అమర్చి చికిత్స చేశారు. అయితే బాలింతను చేర్పించిన ఆసుపత్రికి ఆ వైద్యురాలు రాకపోవడం ఆమె నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పక్కనే ఉన్న మరో ప్రైవేట్ వైద్యుడు రక్తం ఎక్కించారు. శనివారం తెల్లవారుజామున ఆమె ప్రాణాలతో కొట్టుమిట్టాడుతూ తుదిశ్వాస విడిచింది. బాలింత చనిపోయిన విషయాన్ని సదరు వైద్యుడు వైద్యురాలికి తెలపడంతో ఆసుపత్రికి వచ్చి చూసినట్లు స్థానికులు తెలిపారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన..

బాలింత మృతితో ఆసుపత్రి ఎదుట వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. తమ తప్పేమి లేదని కుటుంబీకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విషయం బయటకు రాకుండా ఇద్దరు వైద్యులు కలిసి వారి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

విచారణ చేపడతాం

ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో బాలింత మృతి చెందిన విషయం నా దృష్టికి వచ్చింది. జైనథ్ మెడికల్ అధికారితో విచారణ చేపడతాం. వారి కుటుంబీకులతో మాట్లాడుతాం. వైద్యుల నిర్లక్ష్యం ఉంటే వారిపై చర్యలు తీసుకుంటాం.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

రెండో రోజుకు జేపీఎస్‌ల సమ్మె



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

కైలాస్‌నగర్: తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శనివారం రెండో రోజుకు చేరింది. సర్కారు తీరును నిరసిస్తూ జిల్లాలోని జేపీఎస్‌లు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్, తపస్ అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ చౌహాన్, గోపీకృష్ణ , జెడ్పీటీసీ బ్రహ్మానంద్, పంచాయతీరాజ్ మండల ఆపరేటర్లు, ఎస్‌బీఎం కోఆర్డినేటర్లు మద్దతు తెలిపారు. సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కాగా ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను పిలిపించిన జిల్లా అధికారులు తక్షణమే విధుల్లో చేరాలని లేకుంటే శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అయినా వారు వినకుండా సమ్మెలో పాల్గొన్నారు. కాగా వీరి ఆందోళనకు సంఘీభావంగా రెగ్యులర్ కార్యదర్శులు తమకు అదనంగా అప్పగించిన జీపీల బాధ్యతల నుంచి తప్పించాలని కోరుతూ ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు.

క్లుప్తంగా

హైకోర్టు జడ్జికి సన్మానం



జడ్జిని సన్మానిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ సందర్శన నిమిత్తం జిల్లాకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి ఎంజీ.ప్రియదర్శినిని సంగెం చారిటబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. శాలువా, మెమొంటోతో సత్కరించారు. జిల్లా న్యాయమూర్తిగా ఆదిలాబాద్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు.

పోగొట్టుకున్న డాక్యుమెంట్లు అప్పగింత



డాక్యుమెంట్లు అందజేస్తున్న మేనేజర్

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న విలువైన డాక్యుమెంట్లు అప్పగించి కండక్టర్ ఏడినాథ్ నిజాయతీ చాటుకున్నాడు. నిజామాబాద్ నుంచి నిర్మల్ బయలుదేరిన బస్సులో ప్రయాణించిన శ్రీకృష్ణ తన సంబంధించిన డాక్యుమెంట్ల కవర్ బస్సులోనే మరిచిపోయాడు. వాటిని గుర్తించిన బస్సు కండక్టర్ ఏడినాథ్ కంట్రోలర్‌కు అప్పగించాడు. కంట్రోలర్ అందులో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా శనివారం బాధితుడిని పిలిపించి డీఎం సాయన్న చేతుల మీదుగా డాక్యుమెంట్లు అందజేశారు.

తప్పుడు నంబర్ ప్లేట్లతో దర్జాగా..



నకిలీ నంబర్‌తో వాహనదారుడు

ఆదిలాబాద్‌టౌన్: ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారిపై పోలీసులు జరిమానా విధిస్తున్నారు. వాటినుంచి తప్పించుకునేందుకు పలువురు తమ వాహనాలకు తప్పుడు నంబర్ ప్లేట్లు పెట్టుకుని దర్జాగా తిరుగుతున్నారు. ఇలాంటి సంఘటన ఆదిలాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన బండి అర్చన పేరిట స్ప్లెండర్ ప్లస్ వాహనం రిజిష్టరై ఉంది. ఈ వాహనం నంబర్ టీఎస్01 ఈక్యూ 5314 ఉండగా మరో వ్యక్తి తన వాహనానికి ఇదే నంబర్ పెట్టుకుని తిరుగుతున్నాడు. ఇటీవల తలమడుగు మండలం ఖోడద్ సమీపంలో పోలీసులు హెల్మెట్ లేదని ఈ నంబర్ గల వాహనానికి జరిమానా విధించడంతో అసలు విషయం బయటపడింది. వారం రోజుల క్రితం ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ కారు యాజమాని సైతం ఇలాగే దొంగ నంబర్ పెట్టుకుని తిరుగుతుండగా పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు.

పులిదాడిలో గాయపడిన ఆవు మృతి

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడలో తలండి నారాయణకు చెందిన ఆవుపై శుక్రవారం పులి దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. శనివారం ఆవు మృతి చెందడంతో అటవీశాఖ అధికారులు పంచనామా నిర్వహించారు. బాధిత రైతుకు పరిహారం అందిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

చారిత్రాత్మక బత్తీస్‌గఢ్ కోట



గండి రామన్న హరితవనం



బత్తీస్‌గఢ్ కోటపై ఉన్న ప్రహరీ



ఆస్వాదిద్దాం రండి...



విద్యుత్ కాంతుల్లో శ్యాంఘడ్ కోట

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులకు సెలవుల కాలం.. పదోతరగతి, ఇంటర్, తదితర పరీక్షలన్నీ పూర్తయ్యాయి. కుటుంబ సభ్యులంతా విహారయాత్రలకు వెళ్లేందుకు, ప్రకృతిఒడిలో సేద తీరేందుకు ఇదే సరైన సమయం. ఇందుకోసం వ్యయప్రయాసలకోర్చి వెళ్లలేనివారికి ఇక్కడే మన చెంతనే జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఆహ్లాదం పొందేందుకు, వీక్షించేందుకు ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలను కలిపే సహ్యాద్రి పర్వత శ్రేణులలోని మహబూబ్ ఘాట్స్.. స్వర్ణనది గోదావరిలో కలిసే సోన్ సంగమ ప్రదేశం, పార్కులు.. వెరసి చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. వీటికితోడు చారిత్రక ప్రదేశాలు శ్యాంఘడ్, బత్తీస్‌ఘడ్, నిర్మల్ కోటలు ఇక్కడే ఉన్నాయి. వీటిపై 'సాక్షి' కథనం.

- వేసవి కాలక్షేపం మన చెంతనే
- సేదతీరే ఆహ్లాదం ఇక్కడే..
- చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో..
- చారిత్రక నేపథ్యం కూడా...
- దూరభారం, వ్యయప్రయాసల్లేవ్..

ఓ లుక్కేద్దాం...రండి...

ప్రకృతితో మమేకమయ్యేందుకు నిర్మల్ సమీపంలోగల గండిరామన్న హరితవనం ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరుగా నిలుస్తోంది. జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ హరితవనం ఉండగా నిత్యం వందలాది మంది ప్రజలు ఈ పార్క్‌ను సందర్శిస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో పట్టణ ప్రజలే కాక ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే అనేక మంది ఇక్కడ ఆగి సేద దీరుతారు. ఉదయం వాకర్స్, సీనియర్ సిటిజన్స్‌కు అనువుగా పలు ప్రదేశాలు ఉన్నాయి. వాకింగ్ ట్రాక్, చిన్నపిల్లల పార్క్, వాచ్‌టవర్, క్యానోపివాక్ సౌకర్యం కలదు. తెల్లవారుజామున వందలాది సంఖ్యలో దర్శనం ఇచ్చే నెమళ్లు, పలు రకాల పక్షుల కిలకిలరావాలతో మనస్సుకు ఒకింత ఆహ్లాదం కలుగుతుంది. ఏపుగా పెరిగిన చెట్ల మధ్యలో నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంపులపై సందర్శకులు నడుస్తున్నప్పుడు చక్కటి అనుభూతి పొందుతారు. కోతులు, జింకలకు ఇక్కడ సంరక్షణ కేంద్రాలున్నాయి. అటవీశాఖ అధికారులు ప్రవేశ రుసుముతో పాటు సఫారి వాహన సౌకర్యం కల్పించారు. సందర్శకులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు.

మరింత అభివృద్ధి జరగాలి



నిర్మల్ చుట్టుపక్కల ప్రాంతాల్లోగల పర్యాటక ప్రదేశాల్లో వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. టూరిజం శాఖ మరింత అభివృద్ధి చేస్తే పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుంది. చారిత్రక ఆనవాళ్లు కనుమరుగు కాకముందే వాటిని సంరక్షించుకుంటే భావితరాలకు పురాతన చరిత్రను అందించే అవకాశం ఉంటుంది.

– గంధం రత్నాకర్, నిర్మల్

వసతులు మెరుగుపర్చాలి



నిర్మల్‌కు చారిత్రాత్మకంగా మంచి గుర్తింపు తేవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి కోటలు, కందకాలు, బురుజులు నాటి పరిపాలనా కాలాన్ని తెలుపుతాయి. వసతులు మెరుగుపరిస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

– ధోండి శ్రీనివాస్, నిర్మల్

చారిత్రక కోటలెన్నో...



ఖిల్లాగుట్ట

నిర్మల్ పట్టణం శివారులో గొలుసుకట్టు చెరువులతో పాటు ఆనాటి పాలకుడైన నిమ్మలనాయుడు పట్టణం చుట్టూ ప్రధానమైన రక్షణగోడ నిర్మించాడు. చెరువులను అనుసంధానం చేస్తూ కందకాలు నిర్మించాడు. నాటి ఆనవాళ్లను చూపే బత్తీస్‌ఘడ్, శ్యాంఘడ్, ఖిల్లాగుట్ట, (రాజసౌధం) తదితర చూడదగిన ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి.

వందేళ్ల చరిత్ర కలిగిన సోన్ వంతెన



ప్రాచీన కాలంనాటి సోన్ వంతెన

నిర్మల్–నిజామాబాద్ జిల్లాలను కలిపే సోన్ గోదావరి నదిపైన నిజాం కాలంలో వందేళ్ల క్రితం నిర్మించిన పొడవైన వంతెన ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. నూతనంగా నిర్మించిన వంతెన ఉన్నప్పటికీ పురాతన వంతెన చూపరులను ఇట్టే ఆకట్టుకుంటోంది.

సహజత్వం ఉట్టిపడేలా కొయ్యబొమ్మలు



కొయ్యబొమ్మల తయారీలో కళాకారులు

నిర్మల్ పేరు వినగానే కొయ్యబొమ్మలు గుర్తొస్తాయి. సహజత్వం ఉట్టిపడేలా ఇక్కడి కళాకారులు పొనికి కర్రతో తయారు చేసే కొయ్య బొమ్మల్లో ఆకర్శించే గుణం ఉంది. శిల్పకళ, చిత్రకళలో ఆరితేరిన నిపుణులకు నిర్మల్ నెలువుగా ఉంది. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన నిర్మల్ పెయింటింగ్స్‌కు, కొయ్యబొమ్మలకు నిలయంగా ప్రపంచ ప్రసిద్ధి గాంచింది.

ప్రకృతి రమణీయత...



గండిరామన్న హరితవనం

నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్లే బైపాస్ రోడ్డు నుంచి దాదాపు పది కిలోమీటర్ల దూరంలో ప్రకృతిని అస్వాదించేలా దట్టమైన అడవులు, వంపుతిరిగిన రోడ్లు మనస్సుకు ఆహ్లాదాన్ని అందిస్తాయి. కొరటికల్, మొండిగుట్ట, బూర్గుపెల్లి, తాంద్ర, తదితర గ్రామాలు ఈ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్నాయి. పచ్చదనం పరుచుకుని ఉన్న ప్రకృతిఒడిలో సేద తీరటానికి అనువైన ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి.

హత్యకేసు ఛేదించిన పోలీసులు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

మామడ(నిర్మల్): ఈ నెల 25న పొన్కల్ శివారులో యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. శనివారం మామడ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ జీవన్ రెడ్డి వివరాలు వెల్లడించారు. పొన్కల్ గ్రామానికి చెందిన తాటికొండ వినోద్ (28)ను బండల ఖానాపూర్‌కు చెందిన బాదావత్ రాజు, బాదావత్ కిషోర్, బాదావత్ జైసింగ్ కలిసి హత్య చేశారు. 2021 జనవరిలో బండల ఖానాపూర్‌కు చెందిన బాదావత్ జైసింగ్ కుమారుడు మధు పొన్కల్‌లో ఉంటున్న తాటికొండ వినోద్ ఇంటికి వచ్చి బైక్‌పై స్వగ్రామం తిరిగి వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో మృతి చెందాడు. తన కుమారుడిని వినోద్ హత్య చేశాడనే అనుమానంతో జైసింగ్ పగ పెంచుకున్నాడు. ఈక్రమంలో వినోద్ ఇటీవల బండలఖానాపూర్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా కూలీ పనులు చేస్తున్నాడు. ఇదే అదునుగా భావించిన జైసింగ్ తన కుమారుడు రాజు, తన సోదరుడి కుమారుడు బాదావత్ కిషోర్‌తో కలిసి హత్యకు పథకం వేశారు.

పార్టీ చేసుకుందామని పిలిచి..

25న కిశోర్ పొన్కల్‌కు వెళ్లి పార్టీ చేసుకుందామని చెప్పడంతో ఒప్పుకున్న వినోద్ గుడుంబా కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై బండల ఖానాపూర్ వైపు బయలుదేరారు. మార్గమధ్యలో రాజును ఎక్కించుకుని పొన్కల్ శివారులోని అటవీప్రాంతంలో మద్యం సేవించారు. ఇదే క్రమంలో రాజు కత్తితో వినోద్‌ను పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అటవీప్రాంతంలో పడేశారు. వినోద్ సెల్‌ఫోన్‌ను ఒర్రెలో, రక్తం మరకలు కలిగిన బట్టలను బావిలో పడేశారు. అప్పటి నుంచి ఇద్దరూ పరారీలో ఉన్నారు. ఈ నెల 27న మృతదేహాన్ని కనుగొన్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. జైసింగ్‌ను అరెస్ట్ చేసి విచారించగా నేరం ఒప్పుకున్నాడు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై అశోక్ నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ, ఎస్సైలను డీఎస్పీ అభినందించారు.

నియమ నిష్టలతో హజ్‌యాత్ర చేయాలి



మాట్లాడుతున్న ముఫ్తీ అసీఫొద్దీన్ నద్వీ

ఆదిలాబాద్‌టౌన్: ముస్లింలు నియమ నిష్టలతో హజ్ యాత్ర చేయాలని మాస్టర్ ట్రైనర్ ముఫ్తీ అసీఫొద్దీన్ నద్వీ అన్నారు. ఆదిలాబాద్ హజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది హజ్‌యాత్రకు వెళ్లే వారికి శనివారం టీఎన్జీవోస్ భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యాత్ర సందర్భంగా పాటించాల్సిన నిబంధనలను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 7 నుంచి మక్కాకు విమానాలు ఉంటాయన్నారు. యాత్రకు వెళ్లే వారికి అనేక సందేహాలుంటాయని, వాటిని నివృత్తి చేయడంతో పాటు అక్కడ ఆచరించే ప్రార్థనల గురించి పూర్తిగా వివరించామన్నారు. హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి ఈసారి 340 మంది బయలుదేరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హజ్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నజీరొద్దీన్, జిల్లా కమిటీ సభ్యులు అబుబాకర్, అసీఫొద్దీన్, అక్బార్, హసిబ్, అబ్దుల్ షాహిద్, అమీమ్ షరీఫ్, ఖిజర్ యాఫై, అస్మాత్ అలీ, షేక్ మోయిజ్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు పట్టివేత

భీమిని(బెల్లంపల్లి): కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి స్టేజీ వద్ద శనివారం పోలీసులు నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన సాంబశివారెడ్డి, అలియాస్ శివయ్య, డ్రైవర్ శ్రీకాంత్‌గౌడ్ మ్యాజిక్ పికప్ వెహికిల్‌లో సుమారు 8 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు కన్నెపల్లి మండలానికి తరలిస్తుండగా కన్నెపల్లి పోలీసులు పట్టుకున్నారు. వాటి విలువ సుమారు రూ.15 లక్షలకుపైగా ఉంటుందని వ్యవసాయాధికారులు, పోలీసులు పేర్కొంటున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

నేరడిగొండ(బోథ్): రోడ్డు ప్రమాదంలో బాలుడు గాయాలపాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన ఆడెపు చరణ్ శనివారం తన చిన్నాన్నతో దశరథ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వ్యవసాయక్షేత్రానికి వెళ్తుండగా అదుపు తప్పి కిందపడడంతో చరణ్‌కు గాయాలయ్యాయి. వెంటనే 108లో నిర్మల్ ఆస్పత్రికి తరలించారు.

బిల్డింగ్ పైనుంచి పడి వృద్ధుడు మృతి

మంచిర్యాలక్రైం: ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి కిందపడి వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. స్థానిక శ్రీశ్రీనగర్‌లోని రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం (ఆనందనిలయం)లో నస్పూర్ మండలంలోని సీతారాంపల్లెకు చెందిన దామరకొండ బీరయ్య(70) కొంతకాలంగా అనాధగా ఉంటున్నాడు. శనివారం తన బట్టలు ఆరేసేందుకు బిల్డింగ్ పైకి వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

అన్యాయానికి గురవుతున్న ఆదివాసీలు

- మానవ హక్కుల ఐక్యవేదిక ఉమ్మడి రాష్ట్ర సమన్వయకర్త వీఎస్ కృష్ణ
- గుడిహత్నూర్‌లో ఆదివాసీ సేన తృతీయ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న వీఎస్ కృష్ణ

గుడిహత్నూర్: ఉమ్మడి రాష్ట్రంలోని ఆదివాసీలు చారిత్రక అన్యాయానికి గురవుతున్నారని మానవ హక్కుల వేదిక ఉమ్మడి రాష్ట్ర సమన్వయకర్త వీఎస్ కృష్ణ అన్నారు. ఆదివాసీ సేన తృతీయ రాష్ట్ర మహాసభలు మండలకేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీలు ఉన్న గ్రామాలను పూర్తిస్థాయిలో నోటిఫైడ్ చేయకపోవడంతో ఆయా గూడేల్లో ఉన్న ఆదివాసీలు అన్ని రకాల హక్కులను కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వాల వైఫల్యాల కారణంగా నేడు ఉమ్మడి రాష్ట్రంలో 805 గిరిజన గ్రామాలు, ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 106 గ్రామాల్లో ఆదివాసీలు ఏజెన్సీ ఫలాలు అందలేక పోతున్నారన్నారు. ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మరో 11కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని చూడడాన్ని ఆదివాసీలు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావ్ మాట్లాడుతూ, ఆదివాసీ సంఘాలను ఏకతాటిపై తెచ్చి ఐక్యవేదిక ఏర్పాటు చేసి ఉమ్మడిగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ముందుగా స్థానిక బస్టాండ్ వద్ద గల కుమురంభీం విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సామాజిక పరిశోధకులు ఎస్.ఉషా సీతాలక్ష్మి, ప్రొఫెసర్ ఈసం నారాయణ, ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు, ఉపాధ్యక్షుడు కుమురం అనిల్‌కుమార్, సేన నాయకులు శరత్‌బాబు, అరుణ, జంగు, దశరథ్, లక్ష్మణ్, కోటేశ్వర్, తిరుపతి, రవి, రామకృష్ణ, ఆదినారాయణ, ఉమ్మడి జిల్లా పటేళ్లు పాల్గొన్నారు.

సమ్మర్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న దిలీప్ కుమార్

ఆదిలాబాద్‌రూరల్: గిరిజన విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు నిర్వహిస్తున్న సమ్మర్ సమ్మిట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ దిలీప్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ సమ్మిట్ కేంద్రాన్ని సందర్శించారు. మే 1 నుంచి 15 వరకు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన 50 మంది బాలికలకు ఆదిలాబాద్‌లో, మరో 50 మంది బాలురకు ఉట్నూర్‌లో తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కుట్లు, అల్లికలు, మెహందీ డిజైనింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఆర్ట్, కల్చరల్, నృత్యం, పాటలు, సాహిత్యం, కంప్యూటర్, తదితర అంశాల్లో నిపుణులచే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం తరగతి గదులు, వంటశాల, వసతిగృహ గదులను పరిశీలించారు. ఆయన వెంట ఏసీఎంవో జగన్, ఏటీడీవో నిహారిక, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, అశోక్, ఉదారి నారాయణ, తదితరులు ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కుంటాల(ముధోల్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. కుంటాలకు చెందిన ముజ్జింటి భోజన్న ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే భైంసా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి తుంగన్న ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ.40వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఘటన స్థలాన్ని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ పరిశీలించారు.